ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సత్యశారద

కొత్తవాడ, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమంలో చురుకైన ప్రాత పోషించారని కలెక్టర్ డా.సత్యశారద తెలిపారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా కొత్తవాడ కూడలిలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, దిడ్డి కుమారస్వామి, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని చిత్రాలు 7లో

పాలనాధికారికి అవార్డు


మంత్రి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న డా.సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే రెండో అత్యధిక యువ టూరిజం క్లబ్బుల ఏర్పాటుచేయడంలో ముఖ్య పాత్ర పోషించిన జిల్లా కలెక్టర్ డా.సత్యశారదను అవార్డుతో అభినందించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమెను జ్ఞాపికతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. వారసత్వ సంపదపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తులో పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో నిరాదరణకు గురైన 14 ఆలయాలను గుర్తించి వాటి పునరుద్ధరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

ఆకేరు పొడవునా..
ఇసుకాసురులదే ఇష్టారాజ్యం!





ఉమ్మడి వరంగల్‌లో సాగు, తాగునీటికి కీలకమైన ఆకేరు వాగు.. ఇసుక అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. మూడు జేసీబీ యంత్రాలు.. ఆరు ట్రాక్టర్లు అన్నచందంగా అడ్డదారుల్లో రేయింబవళ్లు తవ్వి రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల రాజకీయ నాయకుల మద్దతు.. మరికొన్ని చోట్ల పోలీసులు 'మామూలు'గా తీసుకుంటుండడంతో వారిని ఏం చేయలేని పరిస్థితి.. నిత్యం వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడుతుండడంతో నీటి నిల్వల కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం వరదలకు కొట్టుకుపోతున్నాయి. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల గుండా ప్రవహించే ఈ వాగులో ఇసుక అక్రమ రవాణా ఎక్కడెక్కడ జరుగుతుందో పరిశీలించి 'ఈనాడు' ప్రత్యేక కథనం.

ఈనాడు, మహబూబాబాద్

రోజువారీ ఇసుక అక్రమ రవాణా ఇలా

ట్రాక్టర్లు	350
ఒక ట్రాక్టర్‌లో రవాణా (క్యూబిక్ మీటర్లు):	3
మొత్తం తరలిస్తోంది (క్యూబిక్‌మీటర్లు):	1050
ఒక ట్రాక్టర్ ఇసుక ధర: రూ.	6000
అక్రమార్కులు పొందుతున్న ఆదాయం(రూ.లక్షలు)	21

నష్కల్ – ఉప్పుగల్లు – కూనూరు – నందనం – రాంనగర్ – వర్ధన్నపేట – ఇల్లంద – కొత్తపల్లి – ల్యాబర్తి – పర్వతగిరి – నెల్లికుదురు – జయపురం – చిన్న గూడూరు – ఉగ్గంపల్లి – ముల్కలపల్లి

120.6 కి.మీ. ప్రవాహం

జనగామ జిల్లా చిల్పూరు మండలం పైపాటు నుంచి ప్రారంభమయ్యే చిన్న ప్రవాహం నష్కల్ వద్ద ఆకేరు వాగుగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఇది ఉమ్మడి వరంగల్ పరిధి 4 జిల్లాల్లోని 13 మండలాల్లో 46 గ్రామాల మీదుగా 120.6 కి.మీ. ప్రవహిస్తోంది. పరివాహకంలోని దాదాపు 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తోంది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భజలాలు వృద్ధి చెందడానికి దోహదపడుతోంది.


ఇల్లంద సమీపంలో

● జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామ సమీపంలో వరద పెరగక ముందు 25 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుకను తరలించేది. ఇప్పుడు వరద ప్రవాహం ఉన్నా 15 ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు.

● ఐనవోలు మండలం నందనం, రాంనగర్ ప్రాంతాల్లో తవ్వకాలకు నెల రోజులుగా చెక్ పడింది. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారుల అండదండలతోనే రవాణా జరిగేదనే ఆరోపణలున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై వాగులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. సుమారు 100 ట్రాక్టర్లు ఇళ్లకే పరిమితమయ్యాయి. కొందరు అక్రమార్కులు రాత్రిపూట తరలిస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఎలాగైనా అధికారులను మచ్చిక చేసుకుని ఇసుక రవాణా చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

● వర్ధన్నపేట మండలం ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపల్లి, ల్యాబర్తి ప్రాంతంలోని వాగు నుంచి ప్రతి రోజు 250 ట్రాక్టర్ల ఇసుక నగరానికి తరలుతోంది. తెల్లవారుజామున 3 గంటలకు ఖమ్మం-వరంగల్ 563వ జాతీయ రహదారిపై దాదాపు 2 కి.మీ. పొడవునా ట్రాక్టర్ల వరుస కనిపిస్తుంది. తోడేందుకు జేసీబీ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇసుకతో కూడిన మట్టిని సైతం వాహనంలో నింపి నీటితో మట్టిని వేరు చేస్తున్నారు.


కొత్తపల్లిలో మట్టిని వేరు చేశాక..


ల్యాబర్తిలో జేసీబీ యంత్రం ద్వారా..

వాగు నుంచి చెరువుకు

జఫర్‌గఢ్ మండలం కోనాచలం ప్రాంతంలోని వాగు నుంచి వర్ధన్నపేట పెద్ద చెరువులోకి వరదనీరు వెళ్లేలా కట్టు కాలువ నిర్మించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి ప్రాంతంలోని మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా రాయపర్తి మండలం కొత్తూరులోని రెండు చెరువుల్లోకి, అక్కడి నుంచి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ చెరువులోకి వరదనీరు వెళ్తోంది. నెల్లికుదురు మండలం ఎర్రబెల్లి గూడెం వద్ద వాగుపై ఉన్న మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా నెల్లికుదురు పెద్ద చెరువులోకి ఆకేరు వరద ప్రవహిస్తుంది. అక్కడా అక్రమ రవాణా సాగుతోంది.

● పర్వతగిరి మండలం చెరువుముందుతండాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారుల నిఘాతో తవ్వకాలు నిలిచాయి. త్వరలో తవ్వకాలు చేసేందుకు అక్రమార్కులు సిద్ధమవుతున్నారు. అధికారులు తమనిపట్టించుకోకుండా చూడాలని పేరున్న ప్రజాప్రతినిధిని కలిసేందుకు సన్నద్ధమవుతున్నారు.

తవ్వకాలను అడ్డుకోవాలని చెప్పాం..

రెవెన్యూ శాఖలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడంతో అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టలేకపోతున్నాం. తవ్వకాలను అడ్డుకోవాలని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లకు చెప్పామని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు పేర్కొన్నారు.


నెల్లికుదురులోని వాగులో నీటిలో దిగబడిన ట్రాక్టర్‌ను బయటికి లాగుతున్న మరో రెండు ట్రాక్టర్ ఇంజిన్లు


నర్సింహులపేట మండలం జయపురం, చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు, మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి, ఉల్లేపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లోంచి 50 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది.



● నెల్లికుదురు మండలం నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, మునిగలవీడు సమీపంలోని వాగుల్లోంచి ప్రతి రోజు 35 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది. వరద నీటిలోంచే ఇసుకను తవ్వి తరలిస్తున్నారు.

కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 45 కేసులు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 64 నమోదు చేసి 96 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 98 వాహనాలను పట్టుకుని కేసులు పెట్టకుండా మైనింగ్ శాఖకు అప్పగించారు


మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద..

టూరిజం క్లబ్బుల ఏర్పాటులో యువత ముందుండాలి

● రాష్ట్రంలో వరంగల్ జిల్లాకు ద్వితీయ స్థానం



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

గీసుకొండ, న్యూస్‌టుడే: టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో యువత ముందుండాలని, క్లబ్‌ల ఏర్పాటులో వరంగల్ జిల్లాను రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన కలెక్టర్ సత్యశారదను వరంగల్ ఎంపీ కడియం కావ్య అభినందించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గీసుకొండ మండలం జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ కావ్య హాజరై ప్రారంభించారు. మొదట కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ విదేశాలకు చెందిన పర్యాటకులు గంగదేవిపల్లి గ్రామాన్ని సందర్శించేలా కృషి చేసిన గ్రామస్థులను అభినందించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని గంగదేవిపల్లిలో చూస్తున్నామని కితాబునిచ్చారు. జిల్లా పాలనాధికారి సత్యశారద మాట్లాడుతూ.. పాకాల ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉందని ఇక్కడి పావురాలు ఆకుపచ్చ రంగులో ఉంటాయని ప్రపంచంలో ఎక్కడా ఇలాంటివి కనిపించవని తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఈవో జ్ఞానేశ్వర్, జిల్లా పర్యాటక అధికారి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకుంటే మేలు

ఖిలావరంగల్: పర్యాటక ప్రాంతాల సందర్శనతోపాటు చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం ఖిలావరంగల్‌కోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ సత్యశారద, ఎంపీ పాల్గొని మాట్లాడారు. నగరాన్ని పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ. .జిల్లాలో యువ టూరిజం క్లబ్బులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కళాశాలలో, పాఠశాలలో ప్రత్యేక టూరిజం క్లబ్బు ఏర్పాటు చేసి వాటిని ప్రోత్సహించాలని సూచించారు. మొదట ఖిలావరంగల్ ఖుష్‌మహల్ నుంచి మధ్యకోట కళాతోరణాల వరకు నిర్వహించిన ర్యాలీలో ఎంపీ, కలెక్టర్‌తోపాటు అధికారులు, ఎన్‌సీసీ కేడెట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కోటలోని కాకతీయుల కళా సంపదను, కళాసంపదను పరిశీలించారు.

ఆయనకు తుపాకీ కావాలట..!

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ నగర పరిధిలో ఓ మాజీ రౌడీషీటర్ తుపాకీ లైసెన్సు కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఆయనకు ఇద్దరు గన్‌మెన్లు ఉన్నారు. ఏ పదవి లేకున్నా తనకు ప్రాణభయం ఉందంటూ గత పాలకుల మద్దతుతో గన్‌మెన్లను పొందారు. తాజాగా తుపాకీ లైసెన్సు కోసం వరంగల్ జిల్లా గీసుగొండ పోలీసు స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చారు. ప్రస్తుతం అది పరిశీలన కోసం మామునూరు ఏసీపీ కార్యాలయానికి చేరినట్లు సమాచారం. పరకాల నియోజకవర్గానికి చెందిన సదరు వ్యక్తి వరంగల్ తూర్పులో అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో అన్నీ తానై వ్యవహరిస్తుంటారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన వారికి.. పాత తరం నాయకులకు పంచాయితీ జరుగుతోంది. ఈనెల 23న వరంగల్ ఎల్బీ నగర్‌లోని ఓ వేడుకల మందిరంలో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ వ్యవహారంలో 21వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్‌నకు తాజాగా కాంగ్రెస్‌లో చేరిన వారికి గొడవ జరిగి పంచాయితీ పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. ఈ వ్యవహారంలో ఇంతేజార్‌గంజ్ పోలీసులు తనను చితకబాదాడని సందీప్.. సీపీ అంబర్‌కిషోర్‌ఝాకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ గొడవలకు సదరు మాజీ రౌడీషీటర్ కారణమని ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. సీపీ ఆదేశాలతో గురు, శుక్రవారాలు డీసీపీ సలీమా సారథ్యంలో ఈ విషయంపై విచారణ జరిగింది. ఇలా ఫిర్యాదులు వస్తున్న క్రమంలో సదరు వ్యక్తికి తుపాకికి అనుమతిస్తే ఆయన బాధితులు మరింత భయభ్రాంతులకు గురి కావాల్సిందేననే ఆందోళన వ్యక్తమవుతోంది.

లంచం అడిగారు.. అనిశాకు చిక్కారు!



పట్టుబడిన నగదుతో ఏటీవో రవీందర్, ఈఈ హుస్సేన్ (పసుపు రంగు చొక్కా)

జనగామ, న్యూస్‌టుడే: ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన జనగామ కలెక్టరేట్‌లోని ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మాజీ సైనికుడు చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇదే మండలంలోని నెల్లుట్ల- లింగాలఘనపురం రహదారి పక్కన పెట్రోలు బంకును ఏర్పాటు చేసేందుకు తన భార్య పేరిట దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశిత రుసుము చెల్లించారు. ఆయనకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్ రూ.14 వేలు డిమాండ్ చేశారు. దీంతో సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఈఈ చిలుకపాటి హుస్సేన్‌కు రూ.12 వేలు, ఏటీవో రవీందర్‌కు రూ.2 వేలు ఇస్తుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం ఉదయం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సాంబయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలని కోరారు.

జనగామ జిల్లాలో వరుసగా వెలుగు చూస్తున్న అవినీతి ఘటనలపై ప్రత్యేక కథనం
'పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?'
6లో..

బిల్లుల చెల్లింపులో రాజకీయ పెత్తనం!

న్యూస్‌టుడే, కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్‌లో అభివృద్ధి పనులు చేసేందుకు సివిల్ గుత్తేదారులు ముఖం చాటేస్తున్నారు. ఇక్కడ పనులు చేయడం ఒక ఎత్తయితే, బిల్లులు పొందడం మరో ఎత్తవుతోందని వాపోతున్నారు. రాజకీయ పలుకుబడి, సిఫార్సులుంటే తప్ప అభివృద్ధి పనులు బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. నిబంధనలు పాటించడం లేదని, సీరియల్ సిస్టమ్ అమలు పరచడం లేదంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ పెత్తనం పెరిగిందనే విమర్శలున్నాయి. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల జోక్యం ఎక్కువైందంటున్నారు. గతంలో పనిచేసిన ఐఏఎస్ కమిషనర్లు బిల్లుల చెల్లింపుల్లో సీరియల్ పద్ధతి అమలు చేశారు. రెండు, మూడేళ్లుగా పరిశీలిస్తే ఇది పాటించడం లేదు. సిఫార్సులు, పైరవీలకే ఉన్నతాధికారులు మొగ్గు చూపుతున్నారని అర్థమవుతోంది.

ఇవిగో ఉదాహరణలు

● బల్దియాలో ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో ఓ గుత్తేదారు రెండు, మూడు నెలల్లో సుమారు రూ.2 కోట్ల బిల్లులు పొందారని తెలిసింది.

● ఇద్దరు గుత్తేదారులు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు చిన్నా చితక నామినేషన్ పనులు చేస్తారు. వీళ్లకు ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తున్నారు. పాలకవర్గం పెద్దల అండ ఉందని ప్రచారం సాగుతోంది.

● హనుమకొండ ప్రాంతంలోని కొందరు గుత్తేదారులకు బిల్లులు ఇవ్వాలని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ప్రజాప్రతినిధి పేరు చెప్పి జాబితా పంపించారని తెలిసింది.

● సీఎం హామీల పథకంలో ఇద్దరు గుత్తేదారులు రూ.కోటి మేర పనులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు ఇవ్వమని తిరస్కరించింది. బల్దియా జనరల్ ఫండ్స్ ద్వారా రూ.65 లక్షల బిల్లులు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి ద్వారా సిఫారసు వచ్చింది. బిల్లులు చెల్లించేందుకు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు.

ముగిసిన ఉత్కర్ష ఉత్సవాలు


పూర్వ ప్రిన్సిపాళ్లతో వైద్య విద్యార్థులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాలలో ఉత్కర్ష-24 ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. వారం పాటు సాగిన ఉత్సవాల ముగింపు సందర్భంగా వైద్య విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డితోపాటు పూర్వ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఏఎన్ఆర్ లక్ష్మి, డాక్టర్ రమేష్‌రావు, డాక్టర్ సంధ్యారాణి, పూర్వ విద్యార్థి(1967 బ్యాచ్) డాక్టర్ హనుమంతరావు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆయా పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు పూర్వ ప్రిన్సిపాళ్లను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పూర్వ ప్రిన్సిపాళ్లు ఆడిపాడి అలరించారు.

అమ్మాయిలు అదరగొట్టారు!



హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సినిమా పాటలకు స్టెప్పులేసి అదరగొట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యవర్గాన్ని అభినందించారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎం.శ్రీలత, ఎం.నరసింహారావు, డి.ప్రభాకరాచారి, ఎం.రణధీర్‌కుమార్, విద్యార్థి యాక్టివిటీ సెంటర్ ప్రతినిధులు శ్రీగౌరి జాహ్నవి, ఎం.సాకేత్, ఎం.కిరిల్ ప్రవర్ష, ఆసిఫ్ అబూబకర్, పావని, భరత్ కుమార్‌రెడ్డి, సిద్ధార్థ, నిషాత్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ముచ్చర్ల(భీమారం)

నేడు ప్రత్యేక ప్రజావాణి

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటుచేసినట్లు జిల్లా పాలనాధికారి డా.సత్యశారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే కార్యక్రమాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యాన పరిశోధన కేంద్రంపై నిర్లక్ష్యం తగదు


బహిరంగ లేఖను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, న్యూస్‌టుడే: ఉద్యాన వన పంటలు పండించే రైతుల శ్రేయస్సు కోసం భారాస ప్రభుత్వం జీవో 31 ద్వారా పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఉద్యానవన పరిశోధన కేంద్రంపై రాసిన బహిరంగ లేఖను నర్సంపేటలో విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో చపాట మిర్చి పంటకు సాగులో ప్రత్యేక గుర్తింపు పొందిందని చెప్పారు. సుగంధ ద్రవ్యాల కోసం ఎమ్మెల్యేగా తాను అప్పటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేయించినట్లు తెలిపారు. నల్లబెల్లి మండలం కన్నారావుపేట శివారులో సర్వే నంబరు 58లో 54 ఎకరాలు కేటాయించి కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వ విద్యాలయానికి అందజేసినట్లు పేర్కొన్నారు. పరిశోధన కేంద్రం పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి నాగేశ్వరరావును డిమాండ్ చేశారు



ఆకాశానికి పచ్చని పందిరి

ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కలిసిపోయి, ఆకాశానికి పందిరి వేసినట్లు ఈ రోడ్డు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా వెళ్తుంటే అడవిలో నుంచి వెళ్తున్నట్లు అనుభూతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి కొత్తకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆరు కిలోమీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనం నిండి కనువిందు చేస్తోంది.

– ఈనాడు, హనుమకొండ

ఓరుగల్లుకు 'ఘన' స్వాగతం!



ఓరుగల్లు.. ఎటుచూసినా.. చారిత్రక ఆలయాలు, గొలుసుకట్టు చెరువులు కనిపిస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయిస్తంభాల ఆలయంతో పాటు ఇతర ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేల మంది పర్యాటకులు వస్తుంటారు. అతిథులను ఆహ్వానించేందుకు వరంగల్ జిల్లాకు నాలుగు దిక్కులా స్వాగత తోరణాలు నిర్మించనున్నారు. అందులో ఒకటి వరంగల్ బొల్లికుంటలో, రెండోది హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో రాంపూర్ వద్ద, మూడోది ఎల్కతుర్తి, నాలుగోది నర్సంపేట వద్ద.. ఇలా నలువైపులా స్మార్ట్ సిటీ నిధులతో ప్రత్యేక స్వాగత తోరణాలు నిర్మించేందుకు అధికారులు పనులు మొదలుపెట్టారు. నిర్మాణాలు పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది. రోడ్డుకు ఇరువైపులా 8 భారీ స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై కాకతీయుల చరిత్ర, శిల్ప సౌందర్యం ఉట్టిపడేలా నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లా బొల్లికుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణానికి సంబంధించిన భారీ స్తంభాలను చిత్రంలో చూడొచ్చు. – ఈనాడు, హనుమకొండ



బంతి పూలవనం.. బతుకమ్మ వేడుకలకు సిద్ధం!

బతుకమ్మ పండగ సమీపిస్తున్న వేళ.. ఓ రైతు వేసిన బంతిపూల తోట ఎరుపు, పసుపు రంగుల పువ్వులతో విరబూసింది. మహబూబాబాద్ మండలంలోని మాధవపురం-కురవి రహదారి వెంట వాహనదారులను ఈ తోట ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్, నెహ్రూసెంటర్

ఉలిక్కిపడిన అడవి..!

- సిబ్బందిపై దాడులతో ఆందోళన

వారు.. రేయింబవళ్లు అటవీ సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తారు. వారిపైనే దాడి జరగడం అటవీ రక్షణ ఎంత ప్రమాదకరంగా మారిందో చెబుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి దామెరవాయిలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు అటవీ అధికారులపై కొందరు ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సరైన పరిష్కారం దొరకడం లేదు.

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి



గాయాల పాలైన అటవీ సిబ్బంది

విధులు.. కత్తిమీద సాము..

ఓ వైపు కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు, పోడుదారులు, అటవీ జంతువులతో ప్రమాదాలు పొంచిఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల వివాదంలో గొత్తికోయల చేతిలో శ్రీనివాసరావు అనే రేంజ్ అధికారి ప్రాణాలు పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

పోడు పేరుతో..

పోడు పేరుతో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పలువురు అడవులను నరికి వేస్తున్నారు. పోడు పట్టాల సర్వే సమయంలో మూడు జిల్లాల్లో 16 ఘటనలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోడును అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారు.

ఆయుధాలపై నిర్ణయమెప్పుడో?

అటవీ అధికారులు అడవుల్లో ఆయుధాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, పోడుదారులు, వేటగాళ్లతో ముప్పు పొంచి ఉంది. 1982కు ముందు అటవీ అధికారులకు తుపాకులు ఉండేవి. మావోయిస్టుల కదలికలతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మళ్లీ ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా.. అది నెరవేరడం లేదు.

గతంలో సంఘటనలు

- 2022 నవంబర్ 9న ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామంలో పోడు జరుగుతుందని తెలిసి వెళ్లిన సెక్షన్, బీట్ అధికారులపై వేట కుక్కలతో దాడి చేయించారు.
- 2022 సెప్టెంబర్‌లో జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో పోడుభూముల్లో ట్రాక్టర్లతో దున్నుతుండగా.. అటవీ అధికారులు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించగా దాడికి పాల్పడ్డారు. ఇద్దరు అధికారులు గాయపడ్డారు.
- 2021 అక్టోబర్‌లో జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం పందిపంపుల గ్రామంలో అటవీభూముల్లో సాగును అడ్డుకునే క్రమంలో అటవీ అధికారులపై పోడురైతులు కారంపొడి చల్లి, పెట్రోల్ పోశారు. మహిళా ఎఫ్‌ఆర్వోతో పాటు ఇద్దరు అధికారులకు గాయాలయ్యాయి.

ఆయుధాలు ఇవ్వడంపై త్వరలో నిర్ణయం



బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

మట్టెవాడ, న్యూస్‌టుడే: అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలు అందించే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అటవీ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్ చంద్రలను శుక్రవారం పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. దాడులు చేసిన వారిపై పీడీ, హత్యాయత్నం, తదితర కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ములుగు ఎస్పీని ఫోన్‌లో ఆదేశించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి: - ప్రభాకర్, సీసీఎఫ్, కాళేశ్వరం జోన్

అకారణంగా విధులు నిర్వర్తిస్తున్న అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రిలో చేర్పించాం. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. అడవుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. అటవీ సంపదను కాపాడే సిబ్బందికి అండగా ఉండాలి.

పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?

- జనగామ కలెక్టరేట్‌కు అవినీతి మకిలి
- పది నెలల్లో రెండో అనిశా ఘటన

ఈనాడు, వరంగల్, జనగామ, న్యూస్‌టుడే

అది జిల్లా పాలనా కేంద్రం. కలెక్టర్‌తోపాటు అనేక శాఖల అధిపతులు విధుల్లో ఉంటారు. కొందరు అవినీతి అధికారుల ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. ఎవరుంటే మాకేంటి? మేం ఏ పనికైనా లంచాలు వసూలు చేసి తీరుతాం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. తమ శాఖ కార్యాలయాలనే అడ్డాగా మార్చారు. అదే జనగామ కలెక్టరేట్.

జనగామ జిల్లాలో గత మూడు మాసాల్లో నెలకొక అవినీతి అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు. కొందరు ప్రజాపాలనకు వేదికగా, పౌర సేవా కేంద్రంగా ఉండాల్సిన జిల్లా సచివాలయానికీ అవినీతి మురికిని అంటిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులే లంచావతారమెత్తి సహోద్యోగులను అవినీతి కూపంలోకి దించుతున్నారు. జనగామ ఆర్‌అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుసేన్‌తో పాటు, సహాయ సాంకేతిక అధికారి రవీందర్‌లు శుక్రవారం అనిశా అధికారులకు చిక్కడం కలకలం రేపింది.

సైనికుడినీ వదలలేదు: జిల్లాలోని లింగాలఘనపురం మండలం బండ్లగూడేనికి చెందిన చిర్ర సత్యపాల్‌రెడ్డి రెండు దశాబ్దాల పాటు సైన్యంలో దేశానికి సేవలు చేసి 20 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. పెట్రోలు బంకు స్థాపించేందుకు గతంలో చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల తమ మండలంలో బంకు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దీనికి కావాల్సిన నిరభ్యంతర పత్రం కోసం ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో నెలరోజుల కిందట అర్జీ ఇచ్చారు. రూ.17 వేల లంచం ఇవ్వాలని ఈఈ హుసేన్ డిమాండ్ చేసి, బేరం అనంతరం రూ.14వేలకు ఒప్పుకున్నారు. అధికారుల తీరు నచ్చక ఆయన వరంగల్ అనిశా అధికారులను సంప్రదించారు.

వారం కిందట తప్పించుకున్నారు..

వారం కిందటే అనిశా అధికారులు వ్యూహాన్ని అమలు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ రోజు ఈఈ లేకపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం టార్గెట్ మిస్ కాలేదు. రూ.14 వేలు ఈఈకి ఇవ్వగా, అందులో నుంచి రూ.2వేలు ఏటీవో రవీందర్‌కు ఇవ్వాలన్న సూచన ప్రకారం ఆయనకు అందజేశారు. శనివారం ఏసీబీ వరంగల్ ప్రత్యేక కోర్టులో వీరిని హాజరుపర్చనున్నారు.

సంవత్సరం	ఏసీబీ కేసులు
2020	7
2021	7
2022	9
2023	11
2024	12



ఆర్‌అండ్‌బి అధికారుల అవినీతి వ్యవహారం.. పట్టివేతపై వివరాలు చెబుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



ఫిర్యాదుదారు చిర్ర సత్యపాల్‌రెడ్డి

మధ్యవర్తులతో వసూలు

- గత నవంబరు 20న జనగామ మున్సిపల్ కమిషనర్ రజిత రూ.40 వేలు లంచం డిమాండ్ చేసి, సదరు డబ్బును తన కారు డ్రైవర్‌కు ఇవ్వమన్నారు. పక్కా వ్యూహంతో ఏసీబీ అధికారులు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు.
- గత జనవరిలో జిల్లా సచివాలయంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, ఒప్పంద ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇచ్చినా సంతృప్తి చెందక, మరో రూ.50వేలకు ఒత్తిడి తేగా సదరు ఉద్యోగిని అనిశాను ఆశ్రయించింది. లంచం తీసుకుంటూ వైద్యాధికారితో పాటు, జూనియర్ అసిస్టెంట్ అజహర్‌లు పట్టుబడ్డారు.

ఎక్కడ వీలైతే అక్కడ

రఘునాథపల్లి మండలం కంచనపల్లి పంచాయతీ కార్యదర్శి తాజా మాజీ సర్పంచి చేసిన పనులకు బిల్లు చెల్లించేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. మండల పరిషత్ కార్యాలయంలో సదరు డబ్బు తీసుకుంటూ జులై నెలలో పట్టుబడ్డాడు. పాలకుర్తి మండల మాజీ ఎంపీటీసీ సభ్యుడు చేసిన పనికి బిల్లు చెల్లించేందుకు మండల ప్రత్యేక అధికారి హోదాలో రూ.10వేల లంచం తీసుకుంటూ ఆ మండల ఇరిగేషన్ అధికారి గోపాల్ అనిశాకు చిక్కారు. పనిచేసే చోట కాకుండా నివాసం ఉన్న హనుమకొండ(నక్కలగుట్ట)లోని ఓ చోట లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

వారిద్దరిదీ ఒకే ఊరు

అవినీతి అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలి. తమ పనుల కోసం లంచం డిమాండ్ చేసే వారి ఆటకట్టించాలనే తపన అవసరమంటున్నారు సామాజిక వేత్తలు. ఈఈ హుసేన్ ఆటకట్టించిన సత్యపాల్‌రెడ్డి, జనగామ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన చెట్టిపల్లి రాజు ఇద్దరిదీ బండ్లగూడెం గ్రామమే.

ఆ ఇంటి యజమానికి నోటీసులు



భవనాన్ని పరిశీలించి, పట్టాదారుతో మాట్లాడుతున్న అధికారులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన ఇంటిని తహసీల్దార్ సదానందం, దేవాదుల ఎత్తిపోతల పథకం డీఈఈ ప్రశాంతి, ఎంపీడీవో అనిల్‌కుమార్ తదితరులు పరిశీలించారు. 'చెరువులోనే భవనం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఇల్లు కట్టిన సర్వే నెంబరుతో పాటు పరిసరాల రైతుల పట్టా భూములను సోమవారం పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని చెప్పారు. ధర్మసాగర్ పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ మహేందర్‌రెడ్డిలు ఆ ఇంటి యజమానికి నోటీసు జారీ చేశారు. పంచాయతీ నుంచి గానీ, కుడా నుంచి గాని ఏవిధమైన అనుమతి లేకుండా ఇల్లు ఎలా నిర్మించారని, దీనికి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉందా, బఫర్‌జోన్‌లో ఉందా నిర్ధారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కిరణ్, సర్వేయర్ సురేందర్, దేవాదుల ఎత్తిపోతల పథకం ఏఈఈ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆందోళన



హనుమకొండ డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమించడానికి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 274 మంది ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 5 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 16 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అర్హులైన అభ్యర్థులు హనుమకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో కంగుతిన్నారు. ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులకు కనీసం సమాచారం అందించే వారేలేరని వాపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేచి చూసిన వారంతా అక్కడే ఆందోళన చేశారు. ఎంతో ఆశతో వస్తే పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న విద్యాశాఖ అధికారి సిబ్బంది అప్పటికప్పుడు ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఒప్పంద పద్ధతిలో ఉద్యోగాలు చేసేందుకు అంగీకారం తెలిపిన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండ విద్యార్థి ఆత్మహత్య



భుక్య అక్షిత్ (పాతచిత్రం)

ఈనాడు, వరంగల్ : అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండకు చెందిన విద్యార్థి భుక్య అక్షిత్ (24) గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన అక్కడ ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుజరాత్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 27 నుంచి ఐఐఎం క్యాంపస్‌లో రెడ్ బ్రిక్స్ సదస్సు (టీఆర్‌బీఎస్) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకల్లో అక్షిత్ కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. 25 మంది విద్యార్థులు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తుండగా అక్షిత్ అందులో ఒకరు. ఈ సదస్సుకు గౌతమ్ ఆదానీతోపాటు ప్రముఖ వ్యాపార దిగ్గజాలు హాజరై ప్రసంగించాల్సి ఉంది. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురైన అక్షిత్ వసతిగృహంలోని తన గదిలో నైలాన్ తాడును ఉపయోగించి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన రెడ్ బ్రిక్ సదస్సును ఐఐఎం రద్దు చేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. వస్త్రాపూర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అక్షిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సోలా సివిల్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి శుక్రవారం ఉదయం అక్షిత్ తల్లిదండ్రులు అహ్మదాబాద్ చేరుకున్నారు. అక్షిత్ చదువుల్లో చాలా చురుకైన విద్యార్థి. భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఏడాదిపాటు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు. 2023లో ఐఐఎంలో సీటు రావడంతో ఎంబీఏ కోర్సులో చేరారు. అక్షిత్ ఆత్మహత్యకు ఒత్తిడే కారణమా మరేదైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

అవివాహితులకు సువర్ణావకాశం




నేడు, రేపు మేరు/దర్జి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి. నెట్ మేరు/దర్జి కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు శనివారం(సెప్టెంబరు 28), ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 837444 5190, 800800 2165లో సంప్రదించవచ్చు.

3న ఎంఏ తెలుగు ప్రవేశ పరీక్ష

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలకు అక్టోబరు 3న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పీఠాధిపతి ఆచార్య బి.బాబురావు శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసిన వారు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్లో wwwpstu-cet.org వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉంటుందని, సకాలంలో హాజరు కావాలని అన్నారు.

శరన్నవరాత్రులకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం



రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 13 వరకు జరిగే శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఈవో శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు ఆహ్వాన పత్రిక అందజేశారు. నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలు, బ్రోచర్లను శుక్రవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాశీబుగ్గ ఓసిటీ కూడలిలో


దుగ్గొండి: మహమ్మదాపురం ఉన్నత పాఠశాలలో


జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులు



మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో

చిరస్మరణీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

జిల్లా అంతటా శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని, పలువురు వక్తులు కొనియాడారు. తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.

– న్యూస్‌టుడే యంత్రాంగం


శివనగర్ 34, 35వ డివిజన్ల పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్‌లో


నర్సంపేట పుర కార్యాలయంలో


పోపా ఆధ్వర్యంలో శివనగర్‌లో


నాయుడు పెట్రోల్ పంపు కూడలిలో

మేమున్నాం.. మీకు తోడుగా
నర్సంపేట: 99635 59929
కార్పొరేషన్: 98484 09191
వర్ధన్నపేట: 99896 42307
వరంగల్ ఈస్ట్: 97053 46535
(10 AM TO 1 PM)

నర్సంపేట: నర్సంపేట పట్టణంలో మురుగు కాలువలను పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా శుభ్రం చేయడం లేదు. పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో మురుగు రోడ్లపై పారుతోంది.

– బిక్షపతి, చిరు వ్యాపారి, నర్సంపేట

సమాధానం: రోడ్లను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నర్సంపేట

పారిశుద్ధ్య పనులు పూర్తి

రంగశాయిపేట,న్యూస్‌టుడే: ఉర్సు నాగేంద్రనగర్ ప్రాంతంలోని శ్రీరామనగర్‌లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను శుభ్రం చేశారు. కాలనీలో చెత్త కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికుల ఫిర్యాదును 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ దృష్టికి తీసుకుపోగా స్పందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి


విజేందర్

మామునూరు, పర్వతగిరి, న్యూస్‌టుడే: వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృత్యువాత పడ్డారు. మామునూరు ఎస్సై కృష్ణవేణి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా చింతనెక్కొండకు చెందిన కానిస్టేబుల్ డబ్బెట విజేందర్(32) తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ.. శంభునిపేటలో నివాసముంటున్నారు. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. మామునూరు శివారులోని చెరువు కట్ట వద్ద అప్పటికే ట్రాక్టర్ టైర్ పగిలి అందులోని ఇటుకలు రోడ్డుపై పడిపోయాయి. వీటిని గమనించని ఆయన వాటిని ఢీ కొట్టి కింద పడిపోయారు. తీవ్ర గాయాలపాలైన విజేందర్‌ను అటువైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ స్వగ్రామమైన చింతనెక్కొండలోని నివాసానికి వెళ్లి విజేందర్ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పలువురు పోలీస్ అధికారులు, తోటి ఉద్యోగులు విజేందర్ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం


గాయపడిన కవిత

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: భార్య మీద కోపం, అనుమానంతో ఓ భర్త విచక్షణారహితంగా కత్తి, ఇనుపరాడ్డుతో భార్యపై దాడి చేసిన ఘటన వర్ధన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం వర్ధన్నపేటకు చెందిన బి.వీరలక్ష్మి, వీరస్వామి దంపతుల మూడో కూతురు కవితను జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన చొప్పరి రవితో 30 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉండగా ఒకరు లండన్, మరొకరు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్నారు. పిల్లలు ఉద్యోగాల్లో స్థిరపడినప్పటి నుంచి రవి వ్యవసాయ పనులు మానివేసి వ్యసనాలకు అలువాటుపడి భార్య కవితను అనుమానిస్తూ నిత్యం గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం భార్య, భర్తల మధ్య గొడవ కావడంతో కవిత తల్లి గారి ఊరైన వర్ధన్నపేటకు వచ్చింది. ఈ నెల 26న రాత్రి వర్ధన్నపేటకు వచ్చిన రవి అత్త, మామ, భార్యతో మాట్లాడారు. ఇక నుంచి భార్యను మంచిగా చూసుకుంటానని చెప్పారు. రాత్రి అందరూ నిద్రపోయాక అర్ధరాత్రి వేళ అప్పటికే తనతో తెచ్చుకున్న ఇనుప రాడ్డు, కత్తిని తీసుకొని నిద్రిస్తున్న భార్య కవితపై రవి విచక్షణారహితంగా దాడి చేసి, కత్తితో గొంతు కోసి పొడిచాడు. అడ్డుకోబోయిన అత్తమామలను సైతం గాయపరిచాడు. కేకలు విని సమీపంలోని వారు వచ్చే సరికి రవి అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే స్థానికులు కవితను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

గుట్కా తరలిస్తున్న వారిపై కేసు నమోదు

పర్వతగిరి : గుట్కా తరలిస్తున్న ఇద్దరిపై పర్వతగిరి ఎస్సై ప్రవీణ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం పర్వతగిరిలో గుట్కాలు అమ్మకాలు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీకి వెళ్లారు. వారిని చూసి ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వెంటాడి పట్టుకున్నారు. తనిఖీ చేయగా గుట్కా, పొగాకు ఉత్పత్తులు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

గీసుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని రాంపురం గ్రామంలో నాంపెల్లి ఉపేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ నేత రడం భరత్, తాజా మాజీ సర్పంచి గోపి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల పాత్రికేయుడు దాసు హరికృష్ణ మృతి చెందారు. గీసుకొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి బియ్యం అందజేశారు. జిల్లా కాంగ్రెస్ నేత ఆల బాలకిషోర్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

యువకులకు పోలీసుల కౌన్సెలింగ్

పోచమ్మమైదాన్, న్యూస్‌టుడే: మట్టెవాడ ఠాణా పరిధిలో ఇన్‌స్టాగ్రామ్ వ్యవహారంలో బిహార్‌కు చెందిన పలువురికి ఠాణా సీఐ గోపీరెడ్డి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. శుక్రవారం వరంగల్ సెంట్రల్ జైలుకు సంబంధించిన పెట్రోల్ బంకులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన ఓ యువకుడు అటుగా వెళ్తున్న విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైంది. ఈవిషయాన్ని నగరవాసులు పోలీసులకు సమాచారం అందించగా వారు స్పందించారు.

సంక్షిప్తంగా

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు బందోబస్తుకు వినతి

కరీమాబాద్, న్యూస్‌టుడే: ఉర్సు రంగలీలా మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు బందోబస్తు కల్పించాలని శుక్రవారం పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాను కలసి విజ్ఞప్తి చేసినట్లు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు తెలిపారు. సీపీని కలిసిన వారిలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి వెంకన్నగౌడ్, సహాయ కోశాధికారి శివమూర్తి, ట్రస్టు ఛైర్మన్ కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు గోనే రాంప్రసాద్ తదితరులు ఉన్నారన్నారు.

సర్దుబాటు ఉత్తర్వులు వద్దు

పర్వతగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో విద్యాశాఖకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీలు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: కట్ర్యాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శని, సోమవారాల్లో వర్ధన్నపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ఐ జోనల్ కార్యదర్శి గుగులోతు సోమన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 బాలబాలికల విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై ఫిర్యాదు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట మున్సిపాలిటీ నిధులు రూ. 60లక్షల్లో జరిగిన అవినీతిపై అధికారులు విచారణ జరిపి పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కలెక్టర్ పరిపాలన అధికారి శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేసినట్లు దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

వర్ధన్నపేట: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని జిల్లా అకాడమిక్ పరిశీలన అధికారి సృజన్ తేజ సూచించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని గుడ్డెడి తండా, డీసీ తండా, నీలగిరిస్వామి తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఎంఈవో శ్రీధర్‌తో కలిసి తనిఖీ చేశారు.

వయోవృద్ధులకు సముచిత గౌరవం

మట్టెవాడ, న్యూస్‌టుడే: సమాజంలో వయోవృద్ధులకు సముచిత గౌవరం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా పాలనాధికారి డా. సత్యశారద తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ కూడలి వరకు ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యత తీసుకోవాలన్నారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మామిడి మార్కెట్‌కు స్థలం కేటాయించాలి

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వచ్చే సీజన్ వరకు మామిడి క్రయవిక్రయాల కోసం ప్రత్యేకంగా మామిడి మార్కెట్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పండ్ల వ్యాపారులు శుక్రవారం మార్కెట్ కార్యదర్శి నిర్మలను కోరారు.

పర్యాటక దినోత్సవం



ఎల్బీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిజ్ఞ

రంగంపేట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వరంగల్ లాల్‌బహదూర్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ పదో తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఎల్బీ కళాశాల నుంచి ములుగురోడ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కెప్టెన్ డాక్టర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

రోల్‌ప్లే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో అధికారులు, ఉపాధ్యాయులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిల్లల ఆరోగ్యంగా ఉండటం, పౌష్టికాహారం, వ్యక్తిగత భద్రత, అంతర్జాలంను వాడటం, మాదక ద్రవ్యాలకు లోను కావడం అంశాలపై జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విద్యాశాఖ ఏఎంవో సృజన్‌తేజ హాజరై ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్ రహదారికి మరమ్మతులు



వరంగల్ ఎనుమాముల సుధాకర్ హోటల్ కూడలి నుంచి ఎన్టీఆర్ నగర్‌కు వెళ్లే రహదారి గుంతలు పడి ప్రమాదాలకు కారణమవుతోంది. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఎన్టీఆర్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శి అడుప మహేశ్, శ్రీరాం రఘుపతి బృందం జంక్షన్‌లో గుంతలను సిమెంటు, కంకర వేయించి పూడ్చి వేయించారు.

– న్యూస్‌టుడే, లేబర్‌కాలనీ

సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలి


నర్సంపేటలో నినాదాలు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

నర్సంపేట, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో శుక్రవారం జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి నర్సంపేట నుంచి రాష్ట్ర సాధన మలి దశ ఉద్యమకారులు తరలి వెళ్లారు. నియోజకవర్గం నుంచి కౌన్సిలర్, ఉద్యమకారులు రమాదేవి, తిరుపతిరెడ్డి, యాదగిరి, కుమారస్వామి, రవి, ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ఉద్యమకారులు బయలుదేరి వెళ్లారు. ముందుగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఐక్యవేదిక బాధ్యులు వెంకట్, రాంబాబు, జైపాల్‌రెడ్డి, మహేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

రాజకీయాభివృద్ధి సాధించండి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: మహిళలకు కేటాయించిన రాజకీయ రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని రాజకీయంగా అభివృద్ధి సాధించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ అన్నారు. చెన్నారావుపేటలో కాంగ్రెస్ మండలాధ్యక్షురాలు పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని డిజిటల్ సభ్యత్వాలను నమోదు చేశారు.

ఇన్‌ఛార్జి మండల విద్యాధికారిగా సరళ

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: జల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలైన సరళను ఇన్‌ఛార్జిమండల విద్యాశాఖాధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు సరళ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు ఆమెను సన్మానించారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల గణన జరిపి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులాలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌ఛార్జి సారయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.జగదీశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సంపేటలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కామారెడ్డిలో చేసిన డిక్లరేషన్ మేరకు సత్వరమే కులగణన చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం అభివృద్ధితో ఉపాధి అవకాశాలు

నర్సంపేట, న్యూస్‌టుడే: పర్యాటక అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నవీన్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో చారిత్రక ప్రదేశాలను సందర్శించి అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, పోస్టర్ మేకింగ్ తదితర వాటిపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి నేతలు

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను శుక్రవారం చెన్నారావుపేట మండల నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు రమేష్, నాయకులు రాంబాబు, శంకరయ్య, అశోక్, రాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన


గ్యాస్ మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సంపేట గ్రామీణం,న్యూస్‌టుడే: నర్సంపేట మండలం మహేశ్వరంలోని శివానీ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుకోకుండా సంభవించే మంటలను ఆర్పేందుకు ఉపయోగించే పరికరాల పనితీరును ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిమాపక అధికారి రాజేంద్రన్, పాఠశాల ఛైర్మన్ సుబ్బారావు, డైరెక్టర్ రాహుల్, ప్రిన్సిపల్ సురేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఉందాం..

నల్లబెల్లి, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉందామని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ పోలీసు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పరేడ్‌ను పర్యవేక్షించారు. సీఐ సాయిరమణ, ఎస్సై ప్రశాంత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల విహారయాత్ర


లింగగిరి శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు విహారయాత్రకు వెళ్లారు. నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు లింగగిరి శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానం సందర్శించారు. దేవాలయాలు, చారిత్రాత్మక ప్రదేశాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ కరుణశ్రీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘తనిఖీల పేరుతో అక్రమ వసూళ్లు’

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీల పేరుతో కొంత మంది వైద్యుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నర్సంపేట పట్టణ కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ బాధ్యులు బాలకృష్ణ, నరేశ్, కార్తీక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే మేలు

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకొని మంచి గుర్తింపు పొందాలని ఎస్సై రాజేష్‌రెడ్డి అన్నారు. జల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చెన్నారావుపేట, నెక్కొండ మండలాల్లోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా **శ్రీ పటాన్ జమీల్**, తండ్రి: బడేసాబ్ అనువారు ఈ క్రింది షెడ్యూల్ నందు తెలియచేసిన ప్లాటును **శ్రీ అనుమాండ్ల @ అనుమల ఉప్పలయ్య**, తండ్రి: కొమ్మయ్య, అనువారి నుండి రిజిస్ట్రేషన్ దస్తావేజు నం. 3820/2024, తేది. 18-4-2024, స.రి.కా. వరంగల్ (ఫోర్ట్) ద్వారా కొనుగోలు చేసినానని తెలియజేస్తూ అమ్మజూపగా, నా క్లయింట్ అగు **శ్రీమతి కాగితాల మౌనిక**, భర్త: హయగ్రీవాచారి, అను వారు కొనుగోలు చేయుటకు అంగీకరించి కొంత డబ్బు అడ్వాన్సుగా ఇచ్చి విక్రయ ఒప్పందం చేసుకున్నారు. కావున, సదరు ఆస్తిపైన ఎవరికైనా ఎలాంటి హక్కులు/ అభ్యంతరములు యున్నచో తగిన ఆధారాలతో ఒక వారం రోజులలోగా నన్ను సంప్రదించవలెను. లేనిచో మిగతా డబ్బు చెల్లించి నా క్లయింటు రిజిస్ట్రేషన్ చేయించుకొనును. ఆటుపిమ్మట వచ్చు అభ్యంతరములు చెల్లనేరవు.

ఆస్తి షెడ్యూలు

వరంగల్ జిల్లా, ఖిలావరంగల్ మండలం, తిమ్మాపూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెం. 280/F నందలి నక్కలపెల్లి రోడ్ మధుశ్రీ బార్ వెనకాల గల 110 చ.గ. విస్తీర్ణము గల ప్లాటు **హద్దులు: తూర్పు:** 35 అడుగుల రోడ్, **పడమర:** జి.రమేష్ గారి ప్లాటు, **ఉత్తరం:** 30 అడుగుల రోడ్, **దక్షిణం:** ఎస్.బాబురావు గారి ప్లాటు.
స్థలము: వరంగల్, తేది: 26-09-2024

ఇట్లు సం/-
BOMMAKANTI KOTESHWAR, B.Sc., LL.M.
Advocate
16-10-1433, 1st Lane Shiva Nagar,
Warangal 506002 Cell: 9849103459

ఎరువుల దుకాణాల తనిఖీ

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండ మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వర్ధన్నపేట ఏడీఏ నర్సింగం శుక్రవారం తనిఖీలు చేశారు. ఎమ్మార్పీ ధరలకు ఆధార్‌కార్డు, ఈ-పాస్ యంత్రం ద్వారా రైతులకు ఎరువులను విక్రయించాలని తెలిపారు. అనంతరం ఊకల్ సొసైటీని సందర్శించి రుణమాఫీపై తెలుసుకున్నారు. కొనాయమాకులలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి పాఠశాలల క్రీడలు ప్రారంభం

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గీసుకొండ, సంగెం మండలాల విద్యార్థులకు జోనల్‌స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పాక శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు పట్టాభి ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

కల్లెడ కళాశాల విద్యార్థుల ప్రతిభ


ఎగ్జిబిట్‌ను చూపుతున్న విద్యార్థులు

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ వనిత అచ్యుత పాయ్ జూనియర్ కళాశాల విద్యార్థులు సైన్స్ మేళా కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలవడంతో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ జనార్దన్, అధ్యాపకులు అభినందించారు. జనార్దన్ మాట్లాడుతూ వరంగల్ ఏవీవీ జూనియర్ కళాశాలలో ఈనెల 26వ తేదీన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఎఫ్ కళాశాలకు చెందిన కొప్పు శ్రావణ్, సాయి, పి.రాజేష్ రైల్వే స్టేషన్‌లో మెట్లు ఎక్కలేని, ప్లాట్‌ఫారం దాటలేని వృద్ధులకు, దివ్యాంగులకు అవసరం ఉన్న రైల్వే స్లైడర్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించి తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు


సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ఒక ప్రతీక అని వర్ధన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పోషయ్య అన్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మలు తయారు చేసి ఆటలు ఆడారు. వైస్ ప్రిన్సిపల్ రాజు, అధ్యాపకులు విష్ణుకుమార్, రజిత, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, సంధ్య, శ్వేత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సూపర్‌వైజర్ దాష్టీకంపై ఫిర్యాదు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో మహిళా రైతులపై మార్కెట్ సూపర్‌వైజర్ దాష్టీకంగా వ్యవహరిస్తున్నారని . ఆయనపై చర్యలు తీసుకోవాలని, ఛాంబర్ ప్రతినిధులు మార్కెట్ కార్యదర్శిని కోరారు. ఖిలావరంగల్‌కు చెందిన కొందరు మహిళా రైతులు సదరు సూపర్‌వైజర్ వ్యవహారంపై ఛాంబర్ ప్రతినిధులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. వారి సమస్యను అర్థం చేసుకున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు శుక్రవారం మార్కెట్ కార్యదర్శికి సమస్య వివరించారు. ఆకుకూరలు విక్రయించుకునే వారికి ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు.

పూర్తిస్థాయి అధికారులుగా డాక్టర్ మురళి, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి


డాక్టర్ మురళి


డాక్టర్ రాంకుమార్‌రెడ్డి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఎంజీఎం ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళిని, కాకతీయ వైద్యకళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ కాటం రాంకుమార్‌రెడ్డిని పూర్తిస్థాయి అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తొలుత జులై 23న వీరిద్దరిని ఇన్‌ఛార్జులుగా నియమించిన ప్రభుత్వం ఆగస్టు 25న ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ స్వర్ణకుమారి, కేఎంసీకి ప్రిన్సిపల్‌గా డాక్టర్ మురళీకృష్ణలను నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. వారు విధుల్లో చేరకపోవడంతో ప్రభుత్వం చివరకు మురళి, రాంకుమార్‌రెడ్డిలను పూర్తిస్థాయి అధికారులుగా నియమించింది.

ఒక్కో గన్నీ సంచికి రూ.50 చెల్లించాలి

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చే ఒక్కో గన్నీ సంచికి రూ.50 చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతులు ఒక్కో సంచిని రూ.80కు కొనుగోలు చేసి.. వాటిలో పంట ఉత్పత్తులు తీసుకొస్తుండగా, వ్యాపారులు రూ.30 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు.